
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



సోమశిలలో 19.023 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం 19.023 టీఎంసీలు ఉన్నాయి. 549 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.60,550
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,438
3శాతం జీఎస్టీతో	రూ.5,601
నవర (8గ్రా)	రూ.44,808

గరిష్టం/కనిష్టం
38.8/27.5

వాతావరణం

వాతావరణంలో తేమ 41 శాతం ఉంది. జిల్లాలో శనివారం ఎండతీవ్రత అధికంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ రోణంకి కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో రెండో పంటకు సంబంధించిన ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలని ఏపీ సివిల్ సప్లయీస్ ఎండీ వీర పాండ్యన్ సూచించారు. గురువారం ఆయన విజయవాడలోని తన ఛాంబర్ నుంచి జేసీ రోణంకి కూర్మనాథ్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తొలుత జేసీ మాట్లాడుతూ జిల్లాలో రెండో పంట కింద 95 వేల ఎకరాల్లో వరి పండిస్తున్నట్లు తెలిపారు. సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు రావచ్చునని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలుకు రైతుభరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులకుఅవసరమైన గోనెసంచెలు,వేబ్రిడ్జిలు సిద్ధం చేశామని చెప్పారు. ధాన్యం రవాణాకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న సీఓఓ సంజయ్

ముత్తుకూరు: పారిశ్రామిక రంగంపై అవగాహన పెంచుకుంటే రాబోయే రోజుల్లో విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని అదాని కృష్ణపట్నంపోర్టు సీఓఓ సంజయ్ కొత్త అన్నారు. ఉడాన్ కార్యక్రమంలో భాగంగా పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు గురువారం పోర్టు, పామాయిల్ పరిశ్రమలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీఓఓ ప్రసంగించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశ్రమల్లోని ప్రధాన విభాగాలు, ఉత్పత్తులను పరిశీలించాలని సూచించారు. ముఖాముఖి పరిశీలనతో అనేక ముఖ్య అంశాలపై సమగ్ర అవగాహన ఏర్పడుతుందన్నారు.

నగరంలో స్వచ్ఛసర్వేక్షణ్ కేంద్ర బృందాల పరిశీలన



పారిశుధ్య నిర్వహణపై నగర పౌరుడిని ఆరాతీస్తున్న కేంద్ర బృంద సభ్యుడు

నెల్లూరు(బారకాసు): నగరంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సంబంధించిన కేంద్ర బృందాలు గురువారం పర్యటించాయి. స్వచ్ఛసర్వేక్షణ్ ర్యాంకుల కేటాయింపునకు 21, 15, 16, 8 డివిజన్‌లలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి వాస్తవాలపై నగర ప్రజలను ఆరాతీశారు. ఈ సందర్భంగా కమిషనర్ వికాస్‌మర్మత్ మాట్లాడుతూ స్వచ్ఛసర్వేక్షణ్ బృందానికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించి నగర పాలక సంస్థ చేపడుతున్న పారిశుధ్య పనులను తెలియజేయాలని కోరారు. నగర ప్రజలందరూ స్వచ్ఛ సర్వేక్షణ్ ఓటింగ్‌లో పాల్గొని నెల్లూరు నగరపాలక సంస్థ ఉత్తమ ర్యాంకు సాధించేందుకు దోహదపడాలని కోరారు.


నేడు, రేపూ డీసీసీబీ సీఈఓల సమీక్ష సమావేశం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆప్కాబ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 13 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు చెందిన సీఈఓ, డీపీడీఎంలతో శుక్ర, శనివారాల్లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు నెల్లూరు డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లోని డీసీసీబీ కార్యాలయంలో జరిగే సమీక్ష సమావేశాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయ అవార్డులకు ప్రతిపాదనల పొడిగింపు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవార్డుల కోసం ప్రతిపాదనలు పంపించేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ గంగాభవాని గురువారం తెలిపారు. గడువు తరువాత వచ్చిన ప్రతిపాదనలను స్వీకరించమని చెప్పారు. వివరాలకు డిప్యూటీ డీఓలు లేదా ఎంఈఓలను సంప్రదించాలని సూచించారు.

అంతా మా ఇష్టం



- సమగ్రశిక్షలో ఇష్టారాజ్యం
- నోటిఫికేషన్ ఇవ్వకుండానే అద్దెకు వాహనాలు
- ఒక్కో వాహనానికి రూ.35వేల చెల్లింపు
- ఫీల్డ్‌విజిట్ అధికారులకు వాహన సౌకర్యం
- ఆ ఆదేశాలను పాటించని ఉన్నతాధికారి
- గతంలోనూ బిల్లుల అక్రమాలు, డిప్యుటేషన్లపై విచారణ
- నేటికీ చర్యలు శూన్యం

జిల్లా సమగ్రశిక్షలో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆ శాఖ ఉన్నతాధికారితో సన్నిహితంగా ఉంటూ ఏ బిల్లులనైనా స్వయంగా చేసేసుకుంటున్నారు. అధికారుల అద్దె వాహనాలకు సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదు. కలెక్టర్ అనుమతులు కూడా తీసుకోకుండానే నాలుగు నెలలుగా బిల్లులు డ్రా చేసుకుంటున్నారు. ప్రతిరోజూ ఉద్యోగులు, అధికారులు ఫేస్ రికగ్నైజేషన్ అటెండెన్స్‌ను వేయాలనే నిబంధనను పాటించడం లేదు.



సమగ్రశిక్ష కార్యాలయం

నెల్లూరు (టౌన్): సమగ్రశిక్షలో నెల ప్రతిపాదికన అద్దెకు కొన్ని వాహనాలు తిప్పుతున్నారు. ఈ వాహనాలకు సంబంధించి కలెక్టర్ అనుమతితో నోటిఫికేషన్ తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్షలో డీఈఓ-1, డిప్యూటీ డీఈఓలు-3, ఏపీసీ-1, సీఎంఓ-1, ఏఎంఓ-1, ఏఓ-1, డీఈ-1, ఈఈ-1, జీసీడీఓ-1, ఐటీడీఓ ఏఎంఓ-1 కలిపి మొత్తం 12 వాహనాలను నెల అద్దె ప్రతిపాదికన తిప్పుతున్నారు. వీటితో పాటు ఆర్జేడీకి నాలుగు నెలల పాటు వాహనాన్ని సమకూర్చాల్సి ఉంటుంది. ఒక్కో వాహనం నెలకు 2,500 కిలోమీటర్లు తిరగాల్సి ఉంది. అందుకు సంబంధించి నెలకు రూ.35 వేలు సమగ్రశిక్ష నుంచి చెల్లిస్తున్నారు. ఆర్జేడీ వాహనానికి నాలుగు నెలలకు రూ.15వేలు చొప్పున చెల్లిస్తున్నారు. వాహనం పాతది కాకుండా కొత్త వాహనమై ఉండాలి. గతేడాది పెట్టుకున్న వాహనాల గడువు ఈ ఏడాది మార్చితో ముగిసింది. మళ్లీ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కలెక్టర్ అనుమతితో నోటిఫికేషన్ విడుదల చేసి వాహనాలను అద్దెకు పెట్టుకోవాల్సి ఉంది. అయితే జూలై వరకు కలెక్టర్ అనుమతులు తీసుకోలేదు. నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఈ నెలలో హడావుడిగా కలెక్టర్ అనుమతి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు.

విచారణపై చర్యలేవి?

సమగ్రశిక్షలో డిప్యుటేషన్లు, బిల్లుల అక్రమాలపై ఈ ఏడాది మే 3న 'సాక్షి' దినపత్రిక 'మేం ఇక్కడే ఉంటాం' శీర్షికన కథనం ప్రచురించింది. ఈ కథనంలో ఒకరి బదులు ఒకరు సంతకాలు చేసిన విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసులు డీఈఓ గంగాభవానిని విచారణాధికారిగా నియమించారు. ఆమె తూతూ మంత్రంగా విచారణ జరిపి నివేదిక పంపారు.దీంతో సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్యను మళ్లీ జూన్‌లో విచారణాధికారిగా నియమించారు. ఈయన నెల్లూరుకొచ్చి సమగ్రశిక్ష అధికారులు, ఉద్యోగులను విచారించి నివేదిక ఇచ్చారు. నేటికీ ఈ నివేదికపై ఎలాంటి చర్యలు లేవు. బహిరంగంగా బిల్లులపై ఒకరి బదులు మరొకరు సంతకాలు పెట్టినా, అడ్డగోలుగా డిప్యుటేషన్లు వేసినా చర్యలు లేకపోవడం ఏమిటని ఆ శాఖలోని కొందరు ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు. ఇప్పటికైనా సమగ్ర శిక్షపై కలెక్టర్ హరినారాయణన్ సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

ఫీల్డ్‌విజిట్ అధికారులకు వాహన సౌకర్యం

సమగ్రశిక్షలో ఫీల్డ్‌విజిట్ అధికారులకు వాహన సౌకర్యం ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ విషయాన్ని ఆ శాఖ ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వారు చెబుతున్నారు. చివరకు సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేయగా వాహనాలను సమకూర్చాలని గత నెలలో జిల్లా సమగ్రశిక్ష కార్యాలయానికి ప్రొసీడింగ్స్ పంపారు. అయితే ఇప్పటి వరకు ఈ విషయంపై చలనం లేదు. నాడు-నేడు పేరుతో సమగ్రశిక్షలో డిప్యుటేషన్ల పర్వం కొనసాగుతోంది. సన్నిహితంగా, ఇష్టమైన వారిని డిప్యుటేషన్ల మీద తెచ్చుకుంటున్న పరిస్థితి ఉంది. సెక్టోరియల్ అధికారిగా 50 ఏళ్లకు పైబడిన వారిని నియమించకూడదని నిబంధన ఉన్నా వాటికి తిలోదకాలు ఇచ్చారు. ఏకంగా ఉద్యోగ విరమణకు దగ్గర ఉన్న ఓ వ్యక్తిని సెక్టోరియల్ అధికారిగా నియమించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దగ్గర కూడా గోప్యంగా ఉంచారని సమాచారం.

కలెక్టర్ అనుమతులు తప్పనిసరి

అద్దె వాహనాలకు సంబంధించి కలెక్టర్ అనుమతులు తప్పనిసరి. కలెక్టర్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఏడాదికి సంబంధించి అనుమతులు తీసుకున్న విషయం నాకు సరిగా గుర్తులేదు. రికార్డులు చూస్తే కానీ తెలియదు. కార్యాలయానికి వెళ్లి చూసి చెబుతా. ప్రతిఒక్కరూ సమయానికి ఫేస్ రికగ్నైజేషన్‌ను వేయాల్సి ఉంటుంది.

– ఉషారాణి, ఏపీసీ

ఎప్పుడంటే అప్పుడు కార్యాలయానికి...

సమగ్రశిక్షలోని అధికారులు, ఉద్యోగుల హాజరుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఫేస్ రికగ్నైజేషన్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. ఉదయం 10.30 గంటలకు, సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో 5 గంటలకు తప్పనిసరిగా ఫేస్ రికగ్నైజేషన్ వేయాలని నిబంధన విధించింది. అయితే కొద్దిమంది ఉద్యోగులు మాత్రమే ఇది పాటిస్తున్నట్లు తెలిసింది. ఎక్కువ మంది ఉద్యోగులు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యన కార్యాలయానికి వస్తున్న పరిస్థితి ఉంది. సాయంత్రం ఎక్కువ మంది ఫేస్ రికగ్నైజేషన్ వేయడం లేదు. ఉన్నతాధికారి ఇచ్చిన చనువు, పట్టించుకోకపోవడం కారణంగా ఈ పరిస్థితి నెలకొందని ఆశాఖ ఉద్యోగులే చెబుతున్నారు. .

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ ఏర్పాటు



ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మందల వెంకటశేషయ్య, పాత్యెం రమణయ్య, ప్రధాన కార్యదర్శులుగా కత్తిరెడ్డి శశిధర్‌రెడ్డి, పొండ్ల అచ్యుతకుమార్‌రెడ్డి, వంగల శ్రీనివాసులరెడ్డి, వేలూరు శివసునీల్‌కుమార్‌రెడ్డిని నియమించారు. కార్యదర్శులుగా చీమల రాజ, గంధం ప్రసన్నాంజనేయులు, ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, సానా వేణుగోపాల్‌రెడ్డి, షేక్ రియాజ్, షేక్ మహబూబ్‌బాషా, ఇసనాక రమేష్‌రెడ్డి, కోశాధికారిగా కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వాకా రాధామాధవి, ఫరూక్ అలీఅహ్మద్, బిల్లా రమణయ్య, నీలం వెంకటసాయి కుమార్, దామెర్ల నాగేశ్వరమ్మ, దేవరకొండ శవికుమార్, చలంచర్ల శ్రీదేవి, షేక్ షబ్బీర్, తుమ్మలపెంట పార్వతమ్మ, టంగుటూరు పద్మనాభరెడ్డి, బొల్లినేని భారతమ్మ, దాసరి భాస్కర్‌గౌడ్, పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తోడేటి భాగ్యమ్మ, షేక్ ఖాజావలి, చెవుల శ్రీనివాసులు, సీహెచ్ సూరి బాబు, ఏకొల్లు వేణు, స్వర్ణా ప్రసాద్, ఈటి మల్లికార్జునరావు, దొంతల రఘురామయ్య, బెల్లంకొండ వాయి, జ్యోతి రామచంద్రారావు, దేవిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, లెక్కల సుధాకర్‌రెడ్డి, దొంతిరెడ్డి నారసింహారెడ్డి, సీహెచ్ దుగ్గయ్య, దస్తగిరి అహ్మద్, మాగంటి శ్రీనివాసులు, యారవ నరసింహాలు నియమితులయ్యారు.

అర్హులందరికీ నవరత్నాలు



నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న జేసీ కూర్మనాథ్, తదితరులు

- జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్
- జిల్లాలో 6,891 మందికి రూ.9.08 కోట్ల మంజూరు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ద్వైవార్షిక మంజూరు కింద అర్హత కలిగిన 6,891 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వివిధ పథకాల ద్వారా రూ.9.08 కోట్లు జమచేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ కూర్మనాథ్ తెలిపారు. గురువారం ఉదయం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు-ద్వైవార్షిక నగదు మంజూరు కింద అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి పొందని వారి ఖాతాల్లో బటన్ నొక్కి నగదు జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, డీఆర్డీఏ, మెప్మా పీడీలు సాంబశివారెడ్డి, రవీంద్ర, సోషల్ వెల్ఫేర్ డీడీ రమేష్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలాదేవి పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని 6,891 మంది లబ్ధిదారులకు రూ.9.08 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. నూతన పింఛన్ లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద బడుగు వర్గాల అభ్యున్నతికి నవరత్నాల కార్యక్రమం కింద అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఏదైనా సాంకేతిక, ఇతర కారణాలతో సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులకు ద్వైవార్షిక నగదు మంజూరు కింద వారి ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగదు జమచేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా జిల్లాలో అమ్మఒడి పథకం కింద 896 మందికి రూ.1.34 కోట్లు, చేదోడు పథకం కింద 2,506 మందికి రూ.2.50కోట్లు, ఈబీసీ నేస్తం కింద 617 మందికి రూ.92.55 లక్షలు, మత్స్యకార భరోసా కింద ఐదుగురికి రూ.50వేలు, నేతన్న నేస్తం కింద 33 మందికి రూ.7.92 లక్షలు, జగనన్న విద్యాదీవెన కింద 1557 మందికి రూ.3.03 కోట్లు, జగనన్న వసతి దీవెన కింద 1206 మందికి రూ.1.13 కోట్లు, రైతు భరోసా కింద 71 మందికి రూ.5.10 లక్షలు కలిపి మొత్తం 6891 మంది ఖాతాల్లో రూ.9.08 కోట్లు జమ చేస్తున్నట్లు వివరించారు. ఇంకా అర్హత ఉండి లబ్ధిపొందని వారు సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



సాంకేతిక కారణంతో మా పొదుపు గ్రూపునకు సున్నా వడ్డీ నగదు అందలేదు. ప్రస్తుతం సున్నా వడ్డీ కింద రూ.30వేలు నగదు మంజూరు చేయడం ఎంతో ఆనందంగా ఉంది. నా భర్తకు పింఛన్ అందుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– పీ హబీబా, బుజబుజనెల్లూరు

పెన్షన్ అందజేసి ఆదుకున్నారు



నేను వైఎస్సార్ పింఛన్ కానుక కింద నగదు పొందుతున్నాను. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో నా పింఛన్‌ను నిలుపుదల చేశారు. అర్హత ఉన్న ఏ లబ్ధిదారులు సంక్షేమ పథకానికి దూరం కారాదనే ఉద్దేశంతో నాకు మళ్లీ పింఛన్‌ను మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

– వెలవడి పలని పెరిశెట్టి, పెద్దబజారు,

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథంపై విశేషాలంకారంలో వెంకయ్యస్వామి



వెంకయ్యస్వామికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి కాకాణి దంపతులు

వెంకటాచలం: గొలగమూడిలో భగవాన్ వెంకయ్యస్వామి 41వ ఆరాధన మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి కాకడ హారతితో మేల్కొలుపు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పట్టుపీతాంబర వస్త్రాలు, విశేష పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరిరోజు ఆరాధన మహోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో గొలగమూడి కోలాహలంగా మారింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు గొలగమూడికి చేరుకునే రెండు మార్గాల్లో పోలీసులు పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు. అలాగే రెండు చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటుచేసి భక్తులకు వైద్య సేవలు అందించారు.

నేత్రపర్వంగా రథోత్సవం

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. వెంకయ్యస్వామిని విశేషంగా అలంకరించి రథంపై ఆశీనులను చేశారు. అనంతరం రథోత్సవాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆశ్రమ ఈఓ పీ బాలసుబ్రహ్మణ్యం ప్రారంభించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. పచ్చా శ్రీహరినాయుడు సోదరులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి కాకాణి దంపతులు

వెంకయ్యస్వామికి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులు గురువారం ఉదయం పట్టు వస్త్రాలు సమర్పించారు. వారికి ఆశ్రమ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వెంకయ్యస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు. కాకాణి దంపతులను ఆశ్రమ ఈఓ బాలసుబ్రహ్మణ్యం శాలువా,పూలమాలలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

ఆరాధనోత్సవాల చివరిరోజున గొలగమూడికి తరలివచ్చిన వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పలుచోట్ల వెంకయ్యస్వామి భక్తులు అన్నప్రసాద వితరణ చేశారు.

ఆశయం ముందు తలవంచిన అవరోధాలు

- పట్టుదలతో గ్రూప్-1 సాధించిన బద్దిపూడి యువతి
- సొంత ప్రిపరేషన్‌తో రెండో ప్రయత్నంలోనే విజయం సొంతం
- మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఎంపిక



రమ్యరెడ్డి

కందుకూరు: ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న ఆమె చిన్ననాటి ఆశయం ముందు పెళ్లి, కుటుంబ బాధ్యతలు, అనారోగ్యం వంటి అవరోధాలన్నీ చిన్నబోయాయి. పట్టుదల, నిరంతర కృషితో ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని నిరూపించింది ఉలవపాడు మండలం బద్దిపూడికి చెందిన చేజర్ల రమ్యరెడ్డి. ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో విజయం సాధించింది. ఎటువంటి కోచింగ్ లేకుండానే తన సొంత ప్రిపరేషన్‌తో రెండో ప్రయత్నంలోనే గ్రూప్-1 ఆఫీసర్‌గా ఎంపికైంది.

పబ్లిక్ సర్వీస్ చిన్ననాటి కోరిక

బద్దిపూడికి చెందిన శ్రీనివాసులరెడ్డి, కృష్ణవేణి దంపతుల కుమార్తె చేజర్ల రమ్యరెడ్డి. తండ్రి సాధారణ రైతు కావడంతో రమ్య పాఠశాల విద్యను అమ్మనబ్రోలులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో పూర్తి చేసింది. విజయనగరం జిల్లా తాటిపూడి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను పూర్తి చేసింది. అనంతరం విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో బీఫార్మసీ, ఏలూరు జిల్లాలోని నోవా కళాశాలలో ఎంఫార్మసీ పూర్తి చేసింది. ఆ తరువాత రెండేళ్ల పాటు అరబిందో ఫార్మా స్యూటికల్స్‌లో ఉద్యోగం చేసింది. 2010లో తల్లిదండ్రులు చూసిన సంబంధం మేరకు మాచవరానికి చెందిన వంశీకృష్ణారెడ్డిని వివాహం చేసుకుంది. భర్త మలేసియాలో ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీర్‌గా పనిచేస్తుండడంతో అక్కడికి వెళ్లారు. ఆ తరువాత 2018లో స్వదేశానికి వచ్చి కరోనా ప్రభావంతో ఇక్కడే ఉండిపోయారు.

రెండో ప్రయత్నంలోనే..

రమ్యరెడ్డి తన రెండో ప్రయత్నంలోనే గ్రూప్-1 ఉద్యోగం సాధించింది. 2018 చివరిలో వెలువడిన గ్రూప్-1 నోటిఫికేషన్ సమయానికి రమ్యకు ఐదేళ్ల కుమారుడితో పాటు కుటుంబ బాధ్యతలు ఉన్నాయి. అయినా సరే గ్రూప్-1 పరీక్షలు రాసి ఇంటర్వ్యూ వరకు వెళ్లింది. ఇంటర్వ్యూలో సరైన మార్కులు రాకపోవడంతో త్రుటిలో ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చింది. 2022 సెప్టెంబర్‌లో మళ్లీ గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదలవగా ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధమైంది. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలు పాసై మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించింది. మెయిన్స్ సమయంలో సైనసైటిస్ మేజర్ ఆపరేషన్‌తో నెల పాటు ప్రిపరేషన్ నిలిచిపోయినా మళ్లీ కోలుకుని పరీక్షలు రాసి విజయం సాధించింది. తాను చిన్ననాటి నుంచి కలలు కన్న ప్రభుత్వ ఉద్యోగం ఆశయాన్ని నెరవేర్చుకుంది.

ఇష్టపడి కష్టపడితే ఏదైనా సాధ్యమే

చాలా మంది పెళ్లి అయిన తరువాత ఇంకేమి సాధిస్తాం అని చెప్తుంటారు. కానీ సరైన లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడితే ఏదైనా సాధించవచ్చు. నా ఉద్యోగ ప్రయత్నంలో నా భర్త వంశీకృష్ణారెడ్డితో పాటు కుటుంబ సభ్యులు చాలా సహకరించారు. అందుకే నాలుగేళ్ల పాటు పట్టు వదలకుండా నిరంతరం కష్టపడి చదివాను. చివరికి నాకు ఇష్టమైన మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్‌లోనే ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. ప్రజలకు సేవ చేసేందుకు ఇది ఒక మంచి అవకాశంగా భావిస్తున్నా.

– రమ్యరెడ్డి

డీపీఎల్‌టీగా డాక్టర్ ఖాదర్‌వలీ


డీఎంహెచ్‌ఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీపీఎల్‌టీ

నెల్లూరు(బారకాసు): జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ, టీబీ (డీపీఎల్‌టీ) నియంత్రణాధికారిగా డాక్టర్ ఖదర్‌వలీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గురువారం సాయంత్రం నెల్లూరులోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు.

ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లో చార్జీల తగ్గింపు

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీఎస్ ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల చార్జీల ధరలు తగ్గించినట్లు నెల్లూరు డిపో–2 డీఎం శివకేశవ్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నుంచి తిరుపతికి 12 ఏసీ బస్సులను రెండు నెలల క్రితం ప్రారంభించామన్నారు. ప్రయాణికుల నుంచి ఆదరణ లభించిందన్నారు. సాధారణ ప్రయాణికులకు కూడా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా రూ.350 ఉన్న చార్జీని రూ.50 తగ్గించి రూ.300గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సులువుగా డబ్బు సంపాదించాలని..


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాములునాయక్

- గంజాయి కొనుగోలు.. ఆపై విక్రయం
- ఆరుగురి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయాలకు పాల్పడుతున్న ఆరుగురు వ్యక్తులను నెల్లూరు బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ వివరాలను వెల్లడించారు. కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డుకు చెందిన రాజపుత్ర జయేష్, వెంకటేశ్వరపురం శివాలయం వీధికి చెందిన అమన్ స్నేహితులు. వారు గంజాయిని సేవించేవారు. ఇద్దరూ సులువుగా డబ్బు సంపాదించాలని గంజాయి విక్రయాలకు తెరలేపారు. ఈనెల 15వ తేదీన కాకినాడకు వెళ్లి హరి అనే వ్యక్తి నుంచి సుమారు ఐదు కేజీల గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం అపోలో సెంటర్ సమీపంలోని శ్రామికనగర్‌లో విద్యార్థులమంటూ గదిని అద్దెకు తీసుకున్నారు. తమ స్నేహితుడైన ఎన్టీఆర్ నగర్‌కు చెందిన షేక్ ఖాజామస్తాన్‌తో కలిసి సుమారు రెండు కేజీల గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయించి సొమ్ము చేసుకున్నారు.

పక్కా సమాచారంతో..

జయేష్, అమన్, ఖాజామస్తాన్ తమ స్నేహితులైన రాయపుపాలేనికి చెందిన రవితేజ, ఏసీ నగర్‌కు చెందిన మహేష్, వనంతోపునకు చెందిన బాలాజీ యశ్వంత్‌తో కలిసి ఈనెల 23వ తేదీ సాయంత్రం ఆ గదిలో గంజాయి సేవించారు. మిగిలిన దానిని విక్రయించేందుకు సిద్ధపడుతుండగా పక్కా సమాచారం అందుకున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని 2.175 కేజీల గంజాయి, గంజాయి పీల్చేందుకు ఉపయోగించే పేపర్ రోల్స్ 15, ఆరు సెల్‌ఫోన్లు, రూ.2 వేల నగదు, ప్లాస్టిక్ బాటిల్ హుక్కాలు, మూడు కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

హత్య చేసేందుకు..

రాజపుత్ర జయేష్‌కు అతని స్నేహితుడైన ఉదయ్ అనే వ్యక్తికి నగదు విషయమై విభేదాలున్నాయి. వారు పలుమార్లు గొడవలు పడ్డారు. ఈ నేపథ్యంలో ఉదయ్‌ను హతమార్చేందుకు జయేష్ తన స్నేహితులైన అమన్, ఖాజామస్తాన్, రవితేజతో కలిసి పథక రచన చేశారు. అందులో భాగంగా కత్తులు కొనుగోలు చేసినట్లు విచారణలో బయటపడిందని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసిన హెచ్‌సీలు కేవీ సుధాకర్, రమేష్, కానిస్టేబుళ్లు తిరుపతి, పి.పార్థసారథి, ఓవీఎస్ శివప్రసాద్, షేక్ దిలీప్‌ను నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

దివ్యాంగ బాలికపై లైంగికదాడి

- నిందితుడికి దేహశుద్ధి
- పోలీసులకు ఫోన్ చేయడంతో పరారీ

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులో ఓ కామాంధుడు బుధవారం రాత్రి ఆరేళ్ల వయసున్న బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వరికుంటపాడు ఎస్టీ కాలనీకి చెందిన దంపతులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. వారి ఆరేళ్ల కుమార్తె దివ్యాంగురాలు (మూగ, చెవుడు). కాగా బాలిక తండ్రి జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాడు. బుధవారం సాయంత్రం తల్లీకుమార్తె కలిసి సరుకుల కోసం కాలనీ నుంచి గ్రామంలోకి వస్తున్నారు. అదే కాలనీకి చెందిన సవరం మాల్యాద్రి అనే యువకుడు దారిలో వస్తూ వారిని మోపెడ్‌పై ఎక్కించుకున్నాడు. తల్లిని దుకాణం వద్ద దింపి బాలికకు చాక్లెట్ కొనిస్తానని తీసుకెళ్లాడు. అయితే కుమార్తె ఇంటికి రాకపోవడంతో రాత్రి వెతుకుతుండగా కనియంపాడు వెళ్లే మార్గంలో ఓ దుకాణం సమీపంలో కనిపించింది. జరిగిన విషయాన్ని బాలిక తల్లికి సైగల ద్వారా తెలిపింది. దీంతో మాల్యాద్రిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా నిందితుడు పరారయ్యాడు. బాలికను చికిత్స నిమిత్తం పామూరు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కావలి డీఎస్పీ వెంకటరమణ గురువారం వరికుంటపాడుకు చేరుకుని కాలనీలో విచారణ చేపట్టారు. ఆయన వెంట ఉదయగిరి సీఐ వి.గిరిబాబు, వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి ఎస్సైలు విజయ్‌శ్రీనివాస్, ఎన్.ప్రభాకర్, కె.ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.

దాడి కేసులో కానిస్టేబుల్‌కు రిమాండ్

- సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు

వింజమూరు (ఉదయగిరి): దుత్తలూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రఫీకి గురువారం ఉదయగిరి సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి జె.అంజయ్య 14 రోజులపాటు రిమాండ్ విధించారు. ఎస్సై కోటిరెడ్డి కథనం మేరకు.. కానిస్టేబుల్ రఫీ అనారోగ్యం కారణంతో ప్రస్తుతం సెలవులో ఉన్నాడు. కాగా అతడికి వింజమూరులో బైక్ మెకానిక్‌గా ఉన్న రసూల్‌కు మధ్య ఓ పోలీస్ ఉన్నతాధికారికి సంబంధించిన జేసీబీ, ట్రాక్టర్ విషయంలో కొంతకాలంగా వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో బుధవారం వింజమూరు మెయిన్‌రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద రసూల్, అతని సోదరుడు నాయబ్‌పై రఫీ దాడి చేసి గాయపరిచాడు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి గురువారం రఫీని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. ఈ క్రమంలో ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

కామాంధుడి అరెస్ట్


మాట్లాడుతున్న డీఎస్పీ రామచంద్ర

- పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు


కందుకూరు: బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడు మస్తాన్‌వలీని అరెస్ట్ చేసినట్లు కందుకూరు డీఎస్పీ రామచంద్ర తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బాధిత చిన్నారి రెండేళ్ల నుంచి కోటకట్ట వీధిలోని అమ్మమ్మ వద్ద ఉంటూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో ఇంటి పక్కనే ఉండే మస్తాన్‌వలీ బుధవారం సాయంత్రం బాలికకు చాక్లెట్లు ఇస్తానని చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న చిన్నారి బంధువులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి పోక్సో యాక్ట్ కింద నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. సీఐ నఫీజ్‌బాషా, పట్టణ ఎస్సై హనీఫ్ పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 226
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 250
లేయర్ చికెన్	: 178

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.10



సినిమా





తెలుగు సినిమా...
ఎత్తర జెండా

అల్లు అర్జున్... ఉత్తమ నటుడు

- తెలుగు సినిమాకి పది అవార్డులు
- 'ఆర్‌ఆర్‌ఆర్'కు ఆరు అవార్డులు
- ఉత్తమ నటీమణులుగా ఆలియా భట్, కృతీ సనన్
- ఉత్తమ చిత్రంగా 'రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్'
- ఉత్తమ దర్శకుడు నిఖిల్ మహాజన్

జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తొలిసారి తెలుగు సినిమాలు దుమ్ము రేపాయి. మొత్తం పది అవార్డులతో 'ఎత్తర జెండా' అంటూ తెలుగు సినిమా సత్తా చాటింది. 69 ఏళ్ల జాతీయ అవార్డుల చరిత్రలో తెలుగు నుంచి జాతీయ ఉత్తమ నటుడిగా 'పుష్ప... ఫైర్' అంటూ అల్లు అర్జున్ రికార్డ్ సాధించారు. ఆస్కార్ అవార్డుతో చరిత్ర సృష్టించిన 'ఆర్‌ఆర్‌ఆర్' ఆరు అవార్డులతో సిక్సర్ కొట్టింది. వీటిలో 'హోల్‌సమ్ ఎంటర్‌టైనర్' అవార్డు 'ఆర్‌ఆర్‌ఆర్' సొంతం అయింది. 2021 జనవరి 1 నుంచి 2021 డిసెంబరు 31 లోపు సెన్సార్ అయి, అవార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న సినిమాలను పరిగణనలోకి తీసుకుని జ్యూరీ సభ్యులు అవార్డులను ప్రకటించడం జరిగింది. జాతీయ ఉత్తమ నటీమణులుగా 'గంగూబాయి కతియావాడి'లో వేశ్య పాత్ర చేసిన ఆలియా భట్, 'మిమి' చిత్రంలో గర్భవతిగా నటించిన కృతీ సనన్ నిలిచారు. ఖగోళ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా ఆర్. మాధవన్ టైటిల్ రోల్ చేసి, స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' ఉత్తమ చిత్రంగా, ఉత్తమ దర్శకుడిగా మరాఠీ ఫిల్మ్ 'గోదావరి'కి గాను నిఖిల్ మహాజన్ అవార్డు సాధించారు. ఇంకా పలు విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం గురువారం జాతీయ అవార్డులను ప్రకటించింది. ఆ విశేషాలు ఈ విధంగా...

69వ జాతీయ అవార్డులకు గాను 28 భాషలకు చెందిన 280 చలన చిత్రాలు పోటీపడ్డాయి. మొత్తం 31 విభాగాల్లో అవార్డులను ప్రకటించారు. సుకుమార్ దర్శకత్వంలోని 'పుష్ప: ది రైజ్' సినిమాలోని నటనకు గాను అల్లు అర్జున్‌కు ఉత్తమ జాతీయ నటుడిగా తొలి అవార్డు లభించింది. ఇదే చిత్రానికి సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డు సాధించారు. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'రౌద్రం..రణం..రుధిరం' (ఆర్‌ఆర్‌ఆర్) సినిమాకు ఆరు విభాగాల్లో అవార్డులు దక్కాయి. జాతీయ హోల్‌సమ్ ఎంటర్‌టైనర్‌గా 'ఆర్‌ఆర్‌ఆర్' నిలిచింది. ఇదే చిత్రానికి ఉత్తమ నేపథ్య సంగీతానికి గాను ఎంఎం కీరవాణి, ఇదే చిత్రానికి స్పెషల్ ఎఫెక్ట్స్‌కి వి. శ్రీనివాస్ మోహనన్, 'నాటు నాటు..' పాట కొరియోగ్రఫీకి ప్రేమ్ రక్షిత్, 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'కొమురం భీముడో..' పాటకు మేల్ ప్లే బ్యాక్ సింగర్‌గా కాలభైరవ, ఇదే చిత్రానికి స్టంట్ కొరియోగ్రాఫర్‌గా కింగ్ సాల్మన్‌లకు జాతీయ అవార్డులు దక్కాయి. ఇక 'నాటు..నాటు'కి రచయితగా తొలి ఆస్కార్ అవార్డు అందుకున్న చంద్రబోస్ 'కొండపొలం'లోని 'ధంధం ధం.. తిరిగేద్దాం...' పాటకు జాతీయ అవార్డు అందుకోనున్నారు. దర్శకుడిగా తన తొలి చిత్రానికి జాతీయ అవార్డు దక్కిన ఆనందంలో ఉన్నారు 'ఉప్పెన'ను తెరకెక్కించిన బుచ్చిబాబు సన. మైత్రీ మూవీ మేకర్స్‌పై వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించిన 'ఉప్పెన' ప్రాంతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచింది. ఉత్తమ సినీ విమర్శకుడిగా నల్గొండ జిల్లాకి చెందిన ఎం. పురుషోత్తమాచార్యులకు అవార్డు దక్కింది. రెండేళ్లుగా 'మిసిమి' మాస పత్రికలో సినిమా పాటల్లో శాస్త్రీయ సంగీతంపై పరిశోధనలు చేస్తూ, పలు వ్యాసాలు రాశారు పురుషోత్తమాచార్యులు. ఇక ఆలియా భట్‌కి 'గంగూబాయి కతియావాడి' జాతీయ ఉత్తమ నటిగా అవార్డు దక్కేలా చేయడంతో పాటు మరో నాలుగు విభాగాల్లో (బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్, మేకప్, ఎడిటింగ్) అవార్డులు వచ్చేలా చేసింది. అలాగే విక్కీ కౌశల్ హీరోగా నటించిన బయోగ్రాఫికల్ డ్రామా 'సర్దార్ ఉద్దమ్'కు ప్రాంతీయ ఉత్తమ హిందీ చిత్రంతో పాటు మొత్తం నాలుగు విభాగాల్లో (సినిమాటోగ్రఫీ, ఆడియోగ్రఫీ, ప్రొడక్షన్ డిజైన్, కాస్ట్యూమ్ డిజైన్) అవార్డులు దక్కాయి. ఈ చిత్రానికి సూజిత్ సర్కార్ దర్శకుడు. తమిళ ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కడైసీ వివసాయి', మలయాళంలో 'హోమ్', కన్నడంలో '777 చార్లీ' అవార్డులు గెలుచుకున్నాయి. ఇంకా పలు భాషల్లో పలు చిత్రాలకు అవార్డులు దక్కాయి.


విక్కీ కౌశల్ (సర్దార్ ఉద్దమ్)


ఆలియా భట్ (గంగూబాయి కతియావాడి)


కృతీసనన్ (మిమీ)

'పుష్ప' చిత్రంలో నటనకుగాను అల్లు అర్జున్‌కి జాతీయ ఉత్తమ నటుడు అవార్డు దక్కడం సంతోషం. తొలిసారి ఈ అవార్డు అందుకోనున్న అల్లు అర్జున్‌కి అభినందనలు. 69వ జాతీయ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమకు బోనాంజాగా నిలిచాయి. అదే విధంగా పాన్ ఇండియా కాన్వాస్‌లో దూసుకుపోతున్న 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి ఆరు విభాగాల్లో ఈ అవార్డులు దక్కటం ప్రశంసనీయం. డైరెక్టర్ రాజమౌళితో పాటు చిత్ర యూనిట్‌కి అభినందనలు. ఉత్తమ సంగీత దర్శకునిగా దేవీశ్రీ ప్రసాద్ (పుష్ప), ఉత్తమ సాహిత్యానికి చంద్రబోస్ (కొండపొలం) జాతీయ అవార్డుకు ఎంపికవడం అభినందనీయం.

- వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

★★★

తెలుగు సినిమా గర్వపడే క్షణాలివి. జాతీయ ఉత్తమ నటుడిగా నిలిచిన బన్నీ (అల్లు అర్జున్)కి శుభాకాంక్షలు. చాలా గర్వంగా ఉంది. రాజమౌళి విజన్‌లో ఆరు అవార్డులు సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌కు, రెండు అవార్డులు సాధించిన 'పుష్ప'కు, 'ఉప్పెన' టీమ్‌కు, సినీ విమర్శకులు పురుషోత్తమచార్యులకు శుభాకాంక్షలు. - చిరంజీవి

★★★

ఇట్స్ సిక్సర్.. జాతీయ అవార్డులు సాధించినందుకు 'ఆర్‌ఆర్‌ఆర్' యూనిట్ అందరికీ శుభాకాంక్షలు. ఎంపిక చేసిన జ్యూరీకి ధన్యవాదాలు. 'పుష్ప'.. తగ్గేదేలే... బన్నీకి, దేవిశ్రీ ప్రసాద్‌లతో పాటు 'పుష్ప' టీమ్‌కి శుభాకాంక్షలు. బోస్ (చంద్రబోస్) గారికి మళ్లీ శుభాకాంక్షలు. 'గంగూబాయి కతియావాడి'తో అవార్డు గెల్చుకున్న మా 'సీత' ('ఆర్‌ఆర్‌ఆర్'లో ఆలియా భట్ సీత పాత్రలో నటించారు)కు కంగ్రాట్స్. 'ఉప్పెన' టీమ్‌తో పాటు జాతీయ స్థాయిలో అవార్డులు గెల్చుకున్నవారికీ శుభాకాంక్షలు.

- రాజమౌళి

★★★

నా నేపథ్య సంగీతాన్ని గుర్తించి, నాకు జ్యూరీ సభ్యులు అవార్డును ప్రకటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను . చంద్రబోస్‌గారికి, దేవిశ్రీ ప్రసాద్, కాలభైరవ.. మా 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌కు శుభాకాంక్షలు. - కీరవాణి

★★★

ఈ జాతీయ అవార్డు మీదే (సంజయ్ సార్, గంగూబాయి.. టీమ్.. ముఖ్యంగా ప్రేక్షకులు). ఎందుకంటే... మీరు లేకుంటే నాకు ఈ అవార్డు దక్కేదే కాదు. చాలా సంతోషంగా ఉంది. ఈ క్షణాలను గుర్తుపెట్టుకుంటాను. మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేసేందుకు ఇంకా కష్టపడతాను. 'మిమి' సినిమాలో నీ (కృతీ సనన్‌ని ఉద్దేశించి) నటన నిజాయితీగా, పవర్‌ఫుల్‌గా ఉంది. ఆ సినిమా చూసి నేను ఏడ్చాను. ఉత్తమ నటి అవార్డుకు నువ్వు అర్హురాలివి. - ఆలియా భట్.

★★★

69 సంవత్సరాలుగా తెలుగు ఇండస్ట్రీకి రాని ఆ అద్భుతాన్ని తీసుకొచ్చిన ప్రేక్షకులకు, నిర్మాతలకు, దర్శకుడికి, ముఖ్యంగా మా ఫ్యామిలీని పతాకస్థాయికి తీసుకుని వెళ్లిన మా అబ్బాయికి (అల్లు అర్జున్) కృతజ్ఞతలు. - అల్లు అరవింద్

ఇంకా వెంకటేశ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్ తదితరులు తమ ఆనందం వ్యక్తం చేశారు.

'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'

భారతదేశ ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త నంబియార్ నారాయణన్ జీవిత చరిత్ర ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. ఇస్రోలో చేరిన నారాయణన్ స్వదేశీ రాకెట్లను అభివృద్ధి చేసే ప్రాజెక్ట్‌లో భాగంగా రష్యా డెవలప్ చేసిన క్రయోజెనిక్ ఇంజన్స్‌ని భారత్‌కి తీసుకురావాలనుకుంటారు. ఇదే సమయంలో పాకిస్తాన్‌కు భారత రాకెట్ సాంకేతిక విషయాలను చేరవేశారనే నెపంతో అరెస్ట్ అవుతారు నారాయణన్. అరెస్ట్ తర్వాత కేరళ పోలీసుల విచారణలో ఆయన ఎలాంటి చిత్రహింసలు అనుభవించారు? ఆ తర్వాత ఆయన జీవితం ఎలా మలుపు తిరిగింది? తనపై వచ్చిన తప్పుడు ఆరోపణల నుంచి నారాయణన్ ఎలా విముక్తి పొందారు? అనే నేపథ్యంలో 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. నంబియార్ నారాయణన్ పాత్ర చేయడంతో పాటు మాధవన్ దర్శకత్వం వహించారు. నారాయణన్ సతీమణి మీన క్యారెక్టర్‌లో హీరోయిన్ సిమ్రాన్ చక్కగా నటించారు. ప్రత్యేకించి ఆమె పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. హీరో సూర్య అతిథి పాత్రలో మెరవడం కూడా ఈ సినిమాకి ప్లస్ అయ్యింది. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది.



ఆర్‌ఆర్‌ఆర్ సిక్సర్


కీరవాణి
శ్రీనివాస్ మోహనన్
కాలభైరవ
ప్రేమ్ రక్షిత్
కింగ్ సొల్మన్


దేవిశ్రీ ప్రసాద్


చంద్రబోస్


పురుషోత్తమాచార్యులు


బుచ్చిబాబు


కేక్ కట్ చేస్తున్న అల్లు అర్జున్‌తో కుటుంబ సభ్యులు, 'పుష్ప' టీమ్

ఇదొక చరిత్ర

- నవీన్ యెర్నేని, వై. రవిశంకర్

అల్లు అర్జున్‌గారికి జాతీయ అవార్డు రావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఇదొక చరిత్ర 'పుష్ప' షూటింగ్ సమయంలోనే అల్లు అర్జున్ తప్పకుండా నేషనల్ అవార్డ్ కొడతారని సుకుమార్‌గారు అనేవారు.. అది ఈ రోజు నిజమైంది. మాకు ఇంత మంచి సినిమా ఇచ్చిన అల్లు అర్జున్, సుకుమార్ గార్లకు థ్యాంక్స్. దేవిశ్రీ ప్రసాద్‌కి జాతీయ అవార్డ్ రావడం హ్యాపీ. అలాగే మా 'ఉప్పెన'కి ఉత్తమ తెలుగు సినిమాగా జాతీయ అవార్డు రావడం గర్వంగా ఉంది. దర్శకుడు బుచ్చిబాబు, టీమ్‌కి అభినందనలు. అలాగే 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి ఆరు అవార్డులు రావడం సంతోషంగా ఉంది.

- నవీన్ యెర్నేని, నిర్మాత

మా మైత్రీ మూవీస్ బ్యానర్‌లో 'ఉప్పెన, పుష్ప' చాలా ప్రతిష్ఠాత్మక చిత్రాలు. జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు నటుడిగా అల్లు అర్జున్‌గారు చరిత్ర సృష్టించారు. తెలుగు సినిమా చరిత్రలో ఇది చిరకాలం గుర్తుండిపోతుంది. దేవిశ్రీ ప్రసాద్‌కి అవార్డు రావడం ఆనందంగా ఉంది. 'ఉప్పెన, పుష్ప' రెండు విజయాల్లో సింహ భాగం సుకుమార్‌గారిదే. 'ఆర్‌ఆర్‌ఆర్, కొండపొలం' చిత్రాలకు జాతీయ అవార్డులు రావడం ఆనందాన్నిచ్చింది.

- వై. రవిశంకర్, నిర్మాత

''నా తొలి సినిమాకే జాతీయ అవార్డు రావడం హ్యాపీగా ఉంది. నిర్మాతలు నవీన్‌గారికి, రవిగారికి, మా గురువుగారు సుకుమార్ గారికి కృతజ్ఞతలు. సినిమా చూడ్డానికి మా ఇంట్లో నన్ను పంపించేవాళ్లు కాదు. అలాంటిది నేను ఒక సినిమాకి డైరెక్ట్ చేయడం, నా ఫస్ట్ సినిమాకే నేషనల్ అవార్డు రావడం అంటే ఏం మాట్లాడాలో అర్థం కావడంలేదు. మా అమ్మగారికి నేషనల్ అవార్డు అంటే ఏంటో కూడా తెలియదు. ఈ అవార్డు గురించి ఆమెకి చెప్పాలంటే. 'ఇండియాలోనే పెద్ద అవార్డు వచ్చింది' అని చెప్పాలి'' అంటున్న బుచ్చిబాబు సనని తదుపరి చిత్రం గురించి అడగ్గా.. ''రామ్ చరణ్‌గారి కోసం మంచి రా అండ్ రస్టిక్ స్టోరీ రాశాను. నా మనసుకి బాగా నచ్చి, రాసుకున్న కథ ఇది. జనవరిలో షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు.

- బుచ్చిబాబు సన, దర్శకుడు

పది అవార్డులతో తొలి రికార్డ్

ఈసారి తెలుగు పరిశ్రమ ఎక్కువ జాతీయ అవార్డులు సొంతం చేసుకోవడంతో పాటు మరో విశేషమైన రికార్డ్ సాధించింది. అదేంటంటే.. 27వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'శంకరాభరణం' (1980) సినిమాకు నాలుగు జాతీయ అవార్డులు లభించాయి. 30వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'మేఘ సందేశం' (1982)కి నాలుగు అవార్డులు వచ్చాయి. అలాగే 'దాసి' (1988) చిత్రం 36వ జాతీయ అవార్డ్స్‌లో ఐదు విభాగాల్లో అవార్డులను దక్కించుకుంది. ఆ తర్వాత తెలుగు సినిమాలకు ఐదుకు మించి అవార్డులు రాలేదు. 35 ఏళ్లకు రెండు ఐదులు.. అంటే పది అవార్డులు దక్కించుకుని తెలుగు చిత్రసీమ తొలి రికార్డ్‌ని సాధించింది.

నా అభిప్రాయాన్ని బలంగా చెప్పాను - ఎంఎం శ్రీలేఖ

''ప్రతి ఏడాది తెలుగు సినిమాలంటే కొంచెం నిర్లక్ష్యం. కంటి తుడుపుగా ఒకటో రెండో అవార్డులు ఇస్తున్నారు. దీనిపై జ్యూరీలో గట్టిగా మాట్లాడేవారు కావాలి. తెలుగుకు ఎందుకు ఇవ్వరు? అని మాట్లాడ గలగాలి. అయితే ఆ సినిమాలో విషయం ఉండాలి.. లేకుంటే మాట్లాడలేం'' అన్నారు సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ. 69వ జాతీయ అవార్డుల్లో దక్షిణాది తరపున జ్యూరీలో శ్రీలేఖతో పాటు రచయిత్రి బలభద్రపాత్రుని రమణి ఉన్నారు. అవార్డులు ప్రకటించిన అనంతరం ఎంఎం శ్రీలేఖ 'సాక్షి'తో మాట్లాడుతూ - ''మామూలుగా ఫైనల్ ప్యానల్‌లో భోజ్‌పురి వాళ్లు ఉంటారు. వారికి మహానటి సావిత్రి గురించి ఏం తెలుస్తుంది? అందుకే జ్యూరీలో ఉన్న తెలుగువారు తెలుగు సినిమాల గురించి గట్టిగా చెప్పాలి. ఓ జ్యూరీ సభ్యురాలిగా నా అభిప్రాయాన్ని నేను బలంగా చెప్పాను. ఈసారి నేను ఏవైతే రావాలనుకున్నానో దాదాపు వాటికే వచ్చాయి. తొలిసారి తండ్రీ కొడుకులు కీరవాణి అన్నయ్య- కాలభైరవ ఒకే వేదికపై అవార్డులు తీసుకోనుండటం నాకో గొప్ప అనుభూతి. ఇక జ్యూరీ సభ్యులకు ఒత్తిడి ఉంటుందనుకుంటారు.. అలాంటిదేమీ లేదు. నిజాయతీగా నాకు ఏది అనిపిస్తే అది చెప్పాను'' అన్నారు.



69వ చలనచిత్ర జాతీయ అవార్డు విజేతలు

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప)
ఉత్తమ నటి: ఆలియా భట్ (గంగూబాయి..) - కృతీసనన్ (మిమీ)
ఉత్తమ చిత్రం: రాకెట్రీ: ద నంబి ఎఫెక్ట్ (హిందీ)
ఉత్తమ దర్శకుడు: నిఖిల్ మహాజన్ (గోదావరి- మరాఠీ సినిమా)
ఉత్తమ పిల్లల చిత్రం: గాంధీ అండ్ కో (గుజరాతీ)
ఉత్తమ మ్యూజిక్ డైరెక్టర్ (నేపథ్య సంగీతం): ఆర్‌ఆర్‌ఆర్ - ఎమ్ఎమ్ కీరవాణి
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): పుష్ప- దేవిశ్రీ ప్రసాద్
ఉత్తమ కొరియోగ్రఫీ: ఆర్‌ఆర్‌ఆర్ -ప్రేమ్ రక్షిత్
ఉత్తమ మేల్ ప్లేబ్యాక్ సింగర్: కాలభైరవ (ఆర్‌ఆర్‌ఆర్ - కొమురం భీముడో..)
ఉత్తమ లిరిక్స్: చంద్రబోస్- కొండపొలం
ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ అవార్డ్ (స్టంట్ కొరియోగ్రఫీ): ఆర్‌ఆర్‌ఆర్- కింగ్ సాల్మన్
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్: ఆర్‌ఆర్‌ఆర్- శ్రీనివాస్ మోహనన్
ఉత్తమ సహాయ నటి: పల్లవీ జోషి (ద కశ్మీరీ ఫైల్స్- హిందీ)
ఉత్తమ సహాయ నటుడు: పంకజ్ త్రిపాఠీ (మిమీ- హిందీ)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: ప్రీతిశీల్ సింగ్ డిసౌజా (గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఫీమేల్ ప్లేబ్యాక్ సింగర్: శ్రేయా ఘోషల్ (ఇరవిన్ నిళల్- తమిళ్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: వీరా కపూర్ ఏ (సర్దార్ ఉద్ధమ్-హిందీ)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: ది మిత్రి మాలిక్ - మాన్సి ధ్రువ్ మెహతా (సర్దార్ ఉద్ధమ్) (హిందీ)
ఉత్తమ ఎడిటింగ్: సంజయ్ లీలా భన్సాలీ (గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (లొకేషన్ సౌండ్ రికార్డిస్ట్): అరుణ్ అశోక్ - సోనూ కేపీ (చవిట్టు మూవీ-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే(అడాప్టెడ్): సంజయ్‌లీలా భన్సాలీ, ఉత్కర్షిణి వశిష్ట (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): షాహీ కబీర్ (నాయట్టు సినిమా-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (డైలాగ్ రైటర్): ప్రకాశ్ కపాడియా - ఉత్కర్షిణి వశిష్ట (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: అవిక్ ముఖోపాధ్యాయ్ (సర్దార్ ఉద్ధమ్ మూవీ-హిందీ)
ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్: భవిన్ రబరీ (ఛెల్లో షో - గుజరాతీ)
ఉత్తమ ఫిలిం ఆన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్: అవషావ్యూహం (మలయాళం)
ఉత్తమ ఫిలిం ఆన్ సోషల్ ఇష్యూస్: అనునాద్-ద రెజోనెన్స్ (అస్సామీ)
ఉత్తమ పాపులర్ ఫిలిం ఆన్ ప్రొవైడింగ్ హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్: ఆర్‌ఆర్‌ఆర్
ఉత్తమ ఆడియోగ్రఫీ (సౌండ్ డిజైనర్): అనీష్ బసు (జీలీ మూవీ- బెంగాలీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (రీ రికార్డిస్ట్ ఆఫ్ ద ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్): సినోయ్ జోసెఫ్ (సర్దార్ ఉద్ధమ్-హిందీ)
ఇందిరాగాంధీ అవార్డ్ ఫర్ బెస్ట్ డెబ్యూ ఫిలిం ఆఫ్ ఎ డైరెక్టర్: మెప్పాడియన్ (మలయాళం)
స్పెషల్ జ్యూరీ అవార్డ్: షేర్ షా (హిందీ) (డైరెక్టర్ విష్ణువర్ధన్)
నర్గీస్ దత్ అవార్డ్ ఫర్ బెస్ట్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్: ద కశ్మీరీ ఫైల్స్ (హిందీ)

ఉత్తమ ప్రాంతీయ చిత్రాలు

ఉత్తమ తెలుగు చిత్రం	: ఉప్పెన
ఉత్తమ తమిళ్ చిత్రం	: కడైసి వివసాయి (ద లాస్ట్ ఫార్మర్)
ఉత్తమ కన్నడ చిత్రం	: 777 చార్లి
ఉత్తమ మలయాళ చిత్రం	: హోమ్
ఉత్తమ హిందీ చిత్రం	: సర్దార్ ఉద్దామ్
ఉత్తమ గుజరాతీ చిత్రం	: లాస్ట్ ఫిల్మ్ షో (ఛెల్లో షో)
ఉత్తమ మరాఠీ చిత్రం	: ఏక్దా కే జాలా
ఉత్తమ మీషింగ్ చిత్రం	: బూంబా రైడ్
ఉత్తమ అస్సామీస్ చిత్రం	: అనూర్ (ఐస్ ఆన్ ది సన్ షైన్)
ఉత్తమ బెంగాలీ చిత్రం	: కల్కొకో-హౌస్ ఆఫ్ టైమ్
ఉత్తమ మైథిలీ చిత్రం	: సమాంతర్
ఉత్తమ ఒడియా చిత్రం	: ప్రతీక్ష్య (ద వెయిట్)
ఉత్తమ మెయిటిలాన్ చిత్రం	: ఈఖోయిగీ యమ్ (అవర్ హోమ్)

ఉప్పెన

మెగా ఫ్యామిలీ నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన హీరోల్లో వైష్ణవ్ తేజ్ ఒకరు. ఆయన నటించిన తొలి చిత్రం 'ఉప్పెన'. ఈ సినిమా ద్వారా బుచ్చిబాబు సన డైరెక్టర్‌గా, కృతీశెట్టి హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఈ ముగ్గురూ తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ అందుకున్నారు. సముద్ర తీరాన ఉప్పాడ అనే పల్లెటూరు. స్కూల్ డేస్ నుంచే బేబమ్మ (కృతీశెట్టి) మీద ఇష్టం పెంచుకున్న మత్స్యకార కుటుంబానికి చెందిన ఆశీర్వాదం (వైష్ణవ్ తేజ్) నిత్యం తననే ఆరాధిస్తూ ప్రేమిస్తుంటాడు. ప్రాణం కంటే పరువు ముఖ్యం అనుకునే పెద్ద మనిషి శేషారాయనం (విజయ్ సేతుపతి). ఆయన కూతురు బేబమ్మ కాలేజీలో చదువుకుంటూ ఉంటుంది. ఆ సమయంలో తన మనసులోని ప్రేమను బేబమ్మకి చెబుతాడు ఆశీర్వాదం. తన స్వచ్ఛమైన ప్రేమను అర్థం చేసుకున్న బేబమ్మ కూడా ఆశీర్వాదాన్ని ప్రేమిస్తుంది. ఇద్దరూ ప్రేమలో ఉన్న విషయం శేషారాయనంకి తెలుస్తుంది. దీంతో ఆశీర్వాదం-బేబమ్మ కలిసి ఊరి నుంచి వెళ్లిపోతారు. ఈ విషయం బయటకి తెలిస్తే తన పరువు పోతుందని ఆర్నెళ్ల పాటు తన కూతురు ఇంట్లోనే ఉందని ఊరి జనాలను నమ్మిస్తాడు రాయనం. ఆరు నెలల తర్వాత అయినా బేబమ్మ ఇంటికి తిరిగొచ్చిందా? తన కులం కానివాడు తన కూతురిని ప్రేమించాడన్న కోపంతో ఆశీర్వాదని శేషారాయనం ఏం చేశాడు? ఆశీర్వాదం-బేబమ్మ ప్రేమకథ ఎలాంటి మలుపు తీసుకుంటుంది? చివరికి వారిద్దరూ ఒక్కటయ్యారా ? లేదా అనేది 'ఉప్పెన' కథ. 2021 ఫిబ్రవరి 12న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది.

